TMEDIA 11వ వార్షికోత్సవం 2016 - 2026 ధన్యవాదాలు!

# ఆదిత

టీ మీడియా – తెలుగు డిజిటల్

- వ్యవసాయం
- పశుసంవర్థక
- ఉద్యానవనం
- గ్రామాభివృద్ధి
- అగ్రి వ్యాపారం

25 సెప్టెంబర్ 2026 | శుక్రవారం

రైతు అభివృద్ధే మా లక్ష్యం



# కరువు కోరల్లో వేరుశనగ

**అనంతపురం:** ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశంలోనే వేరుశనగ సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన అనంతపురం జిల్లాలో ఇప్పుడు కరువు ఛాయలు అలుముకున్నాయి. పచ్చని వేరుశనగ చేలతో కళకళలాడిన నేల.. నేడు కరువు కోరల్లో చిక్కుకుని నెర్రెలు బారుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో పాటు వ్యవస్థాగత లోపాలు రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి.

### పాతాళానికి సాగు విస్తీర్ణం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సాధారణంగా 15 లక్షల నుంచి 18 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగు జరిగేది. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులతో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. ప్రస్తుతం కేవలం 1.5 లక్షల నుంచి 2 లక్షల ఎకరాల లోపే సాగు జరిగినట్లు అంచనా.

### పొలాల్లోనే ఎండుతున్న పంట

ఆగస్టు–సెప్టెంబర్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో విత్తిన వేరుశనగ పంట ఎండిపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా దక్కని పరిస్థితిలో రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటపై ఆశలు వదులుకున్న కొందరు రైతులు ఎండిపోయిన చేలను ట్రాక్టర్లతో తొలగిస్తున్నారు.

### మూతపడిన ఆయిల్‌ఫెడ్

దళారుల బారిన పడకుండా రైతులకు మద్దతు ధర కల్పించడం, నేరుగా వేరుశనగ కొనుగోలు చేయడం, నాణ్యమైన విత్తనాలను అందించడం. పంటి లక్ష్యాలతో ఏర్పాటైన ఏపీ ఆయిల్‌ఫెడ్ సంస్థ కార్యకలాపాలు అనంతపురంలో మందగించాయి. ప్రాసెసింగ్ ప్లాంట్ పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులు, దళారులపై ఆధారపడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# తెలంగాణలో దంచికొడుతున్న వర్షం

**హైదరాబాద్:** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఉమ్మడి వరంగల్, ఖమ్మంతో పాటు పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, నల్గొండ జిల్లాలకు పసుపు హెచ్చరికలు జారీ చేసింది.

### పిడుగుపాటుకు ముగ్గురు మృతి



వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరులో పొలం పనులకు వెళ్లిన మహిళలపై పిడుగు పడటంతో ముగ్గురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు.

### కూలిపోయిన వంతెన



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర్‌లో ఈదురుగాలులకు పలు ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. ములకలపల్లి మండలం రాజుపేటలో పాములేరు వాగుపై ఉన్న వంతెనే కూలిపోయింది.

వాయుగుండం ప్రభావంతో మరో రెండు రోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



# ఆక్వా ఫీడ్ ధరల పెంపుపై ఏపీ హైకోర్టు స్టే

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రైతులకు కీలక పరిణామం చోటుచేసుకుంది. రొయ్యల ఫీడ్ ధరలను ఏకపక్షంగా పెంచడాన్ని సవాల్ చేస్తూ రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. కోర్టు రికార్డు ప్రకారం.. జూన్ 12, 2026న సరఫరా సంస్థ జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొన్న ధరల ప్రకారమే ఫీడ్‌ను విక్రయించాలని ఆదేశించింది.

### ధరల పెంపుపై రైతుల అభ్యంతరం

ఫీడ్ కంపెనీలు ఏకపక్షంగా రొయ్యల మేత ధరలను పెంచుతున్నాయని ఆరోపిస్తూ ఆక్వా రైతులు హైకోర్టును ఆశ్రయించారు. APSADA చట్టం–2020 ప్రకారం ఫీడ్, ఫీడ్ సప్లిమెంట్స్, ఆక్వా కెమికల్స్ తదితర ఇన్‌పుట్స్ ఉత్పత్తి, పంపిణీ, విక్రయాలను నియంత్రించే అధికారం ఉందని పిటిషనర్ల తరపు వాదనలు.

### అంతర్జాతీయ మార్కెట్ కారణమన్న కంపెనీలు

ఫీడ్ ధరల పెంపునకు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, ముడి పదార్థాల ధరలు పెరగడం కారణమని కంపెనీల తరపు వాదనలు ఉన్నాయి. 2026 జూన్‌లో రొయ్యల ఫీడ్ ధరలు కిలోకు రూ.12–16 వరకు పెరిగినట్లు పరిశ్రమ వర్గాలను ఉటంకిస్తూ నివేదికలు తెలిపాయి.

### పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల భారం

హైకోర్టు సెప్టెంబర్ 3న ఇచ్చిన మధ్యంతర ఆదేశాల్లో జూన్ 12న జారీ చేసిన సర్క్యులర్‌లోని ధరలనే కొనసాగించాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 30కి వాయిదా వేసింది. ఫీడ్ ధరల పెరుగుదలతో రైతులపై ఆర్థిక భారం పెరుగుతోందని ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.